క్లుప్తంగా

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత


పట్టుబడిన బంగారం

శంషాబాద్: అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. దుబాయ్ నుంచి ఇండిగో విమానంలో వచ్చిన ప్రయాణికుడు లగేజీలో ఉన్న కాగితంలో దాచి ఉంచిన మూడు బంగారు బిస్కెట్లను తన వ్యాలెట్‌లోకి మారుస్తున్న క్రమంలో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. పట్టుబడిన బంగారం 349 గ్రాములు ఉన్నట్లు గుర్తించారు. దాని విలువ 18.46 లక్షలు ఉంటుందని నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ సంబరాలు


పుప్పాలగూడలో మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో సంబరాలు

మణికొండ: కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏకంగా 136 సీట్లను గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుండటంతో మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ఆ పార్టీ నాయకులు ఘనంగా సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితేందర్, వట్టినాగులపల్లి నాయకుడు ప్రదీప్ కుమార్‌ల ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకుని, బ్యాండు మేళాలతో ర్యాలీలు నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం సంతరించుకుంటుందన్నారు. అందుకు మొదటి అడుగు కర్ణాటక నుంచి పడిందన్నారు.

బాలిక అదృశ్యం



శంషాబాద్: బాలిక అదృశ్యమైన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ రాంచంద్రయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని రాళ్లగూడలో నివాసముంటున్న నర్సింహా లక్ష్మీ దంపతుల కుమార్తె నందిని (16) ఈ నెల 4 తేదీ తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో ఇంట్లో కనిపించకపోవడంతో తల్లిదండ్రులు అన్ని చోట్లా వెతికారు. ఆచూకి లభించకపోవడంతో శనివారం ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్ మీడియా జర్నలిస్టులు-సవాళ్లపై వర్క్‌షాప్

రాయదుర్గం: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ప్రత్యేకంగా డిజిటల్ మీడియా జర్నలిస్టుల కోసం సవాళ్లపై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. సైబరాబాద్ పోలీసులు, ఎండ్ నౌ ఫౌండేషన్, తెలంగాణ స్టేట్ పోలీస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ సైబర్‌తోపాటు భద్రత(టీఎస్‌పీసీసీ), సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. సీపీ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ సమాజం, రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థలపై వినాశకరమైన ప్రభావాన్ని ఎలా చూపుతాయో ఆయన వివరించారు. తప్పుడు సమాచార ప్రభావం ఎలా ఉంటుందో కూడా చెప్పారు. ఎస్‌సీఎస్‌సీ సెక్రటరీ జనరల్ కృష్ణ , సీనియర్ జర్నలిస్టులు జహీరుద్దీన్‌అలీఖాన్, శ్రీనివాస్‌రెడ్డి, సోమశేఖర్, రాకేష్, అనిల్, డాక్టర్ సోనియా శర్మ , సుశీల్‌రావు, సాయితేజ కావేటి తదితరులు మాట్లాడారు.

సీసీఆర్టీ సమ్మర్ క్యాంపు.. అడ్మిషన్స్ ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని సీసీఆర్టీలో ఇంద్రధనుష్ పేరిట సమ్మర్ క్యాంపును నిర్వహిస్తున్నారు. ఈనెల 23వ తేదీ నుండి జూన్ 02 వ తేదీ వరకు తరగతులను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో పోటరీ, క్లే మోడలింగ్, టై అండ్ డై , అప్లిక్యూ ఆర్ట్, పేపర్ క్రాఫ్టలతో పాటు కూచిపూడి డ్యాన్స్, ఫోక్ డ్యాన్స్, మూమెంట్, మైమ్, ఫొటోగ్రఫీ, క్లాసికల్ పెయింటింగ్, స్టోరీ టెల్లింగ్, క్రియేటివ్ రైటింగ్ తదితర అంశాలలో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. 6వ తరగతి నుండి 9వ తగరతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తరగతులను నిర్వహించనున్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.2000. వివరాలకు ఫోన్ 9063357895, 8886333799లలో సంప్రదించవచ్చు.

కార్పొరేటర్ పర్యటన

గోల్కొండ: షేక్‌పేట్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యుడు, షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రషీద్ ఫరాజుద్దీన్ అన్నారు. శనివారం ఆయన డివిజన్ పరిధిలోని సమతా కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు సుల్తాన్ తదితరులున్నారు.

పోలీస్‌స్టేషన్ మళ్లీ తిరిగొస్తోంది..

- 1916 నాటి హెరిటేజ్ భవనంలోకే మరోసారి..
- బండ్లగూడకు కొత్త పోలీస్‌స్టేషన్
- ఈనెల 5న స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించిన సీపీ సీవీ ఆనంద్


హెరిటేజ్ భవనంలోకి తిరిగి తరలనున్న చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట పాత పోలీస్‌స్టేషన్ భవనంలో మళ్లీ పోలీసు బూట్ల చప్పుళ్లు వినపడనున్నాయి. కుమ్మర్‌వాడి రహదారిలోని భవనంలో ఉన్న ఈ ఠాణాను 22 నెలల క్రితం బండ్లగూడలో సకల హంగులతో నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్చారు. కాని ఈ ఠాణా తరలింపు సమయంలో చాంద్రాయణగుట్ట పరిసర ప్రజల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. సున్నితమైన ప్రాంతంలో పోలీస్‌స్టేషన్ లేకపోవడంతో శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని కుమ్మర్‌వాడీ, కేశవగిరి ప్రాంతాలకు చెందిన ప్రజలు ఠాణా ముందు ధర్నా కూడా నిర్వహించారు. కాని అధికారులు అవేమి పట్టించుకోకుండా 2021 జూలై 24న నూతన భవనంలోకి తరలించారు. అప్పటి నుంచి ఆవేదనలో ఉన్న స్థానికులు తాజాగా పోలీసు ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది. పాత భవనంలోకి తిరిగి చాంద్రాయణగుట్ట ఠాణాను తరలించేందుకు అధికారులు నిర్ణయించారు.

1916లో నిర్మించిన భవనం..

శ్రీశైలం రూట్‌లోని కుమ్మర్‌వాడీ రహదారిలో నిజాం నవాబుల హయాంలో 1916లో ఈ పోలీస్‌స్టేషన్ భవనాన్ని నిర్మించారు. అప్పటి నుంచి 105 ఏళ్ల పాటు ఈ హెరిటేజ్ భవనంలో పోలీసు సేవలు కొనసాగాయి. భవనం సరిపోవడం లేదన్న కారణంతో రెండేళ్ల క్రితం తరలించినప్పటికీ.. తాజాగా పరిపాలన సౌలభ్యం కోసం హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పునర్విభజన చేస్తుండడంతో మరోసారి ఈ భవనంలో స్టేషన్ కొనసాగేందుకు అవకాశం దక్కింది. ఇందుకు సంబంధించిన చిన్నచిన్న మరమ్మతులు చకచకా కొనసాగుతున్నాయి. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఈనెల 5న స్టేషన్ ప్రాంగణాన్ని స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ముహూర్తం ఖరారు కాకపోయినప్పటికీ ఈ నెలలోనే పోలీస్‌స్టేషన్ ప్రారంభం కానుందని పోలీస్ వర్గాలు తెలిపాయి.

రెండు పోలీస్‌స్టేషన్లు.. చాంద్రాయణగుట్ట, బండ్లగూడ

చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిని విభజించి బండ్లగూడ పేరుతో మరో కొత్త ఠాణాను ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం బండ్లగూడలోని అధునాతన భవనంలో బండ్లగూడ పోలీస్‌స్టేషన్.. చాంద్రాయణగుట్టలోని పాత భవనంలో చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్లు కొనసాగనున్నాయి. చాంద్రాయణగుట్ట పేరుతో నూతనంగా ఏర్పాటైన ఏసీపీ డివిజన్‌లోని పోలీస్‌స్టేషన్లే కావడంతో పరిధిలోకి ఈ రెండు ఠాణాలతో పాటు కంచన్‌బాగ్ ఠాణాను కూడా పరిగణనలోకి తీసుకొని ఫైనల్ చేయనున్నారు.

కొత్త పోలీస్‌స్టేషన్ ఆవశ్యకతను ముందే వివరించిన 'సాక్షి'



కొత్త పోలీస్‌స్టేషన్ ఆవశ్యకతను రెండేళ్ల కిందటే వివరించిన సాక్షి కథనం

చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌ను విభజించి కొత్తగా బండ్లగూడ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను 'సాక్షి'దినపత్రిక 2021 జనవరి 4న 'పాతబస్తీలో మరో కొత్త ఠాణాకు కసరత్తు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. పోలీస్‌స్టేషన్ పరిధి విశాలంగా ఉండడం.. ఇందులోనే బెంగళూరు, శ్రీశైలం హైవేలు సైతం ఉండడంతో ప్రమాదాల సంఖ్య కూడా ఎక్కువ సంఖ్యలో నమోదవుతుండడం. అరబ్ షేక్‌ల వ్యవహారాలు, భూ వివాదాలు, ఖాళీగా ఉన్న ప్రాంతం ఎక్కువగా ఉండడంతో రోజురోజుకూ కొనసాగుతున్న నిర్మాణాల సంఖ్యకు అనుగుణంగా జనాభా పెరుగుతుండంతో పోలీసులు పూర్తిస్థాయిలో సేవలందించలేని పరిస్థితిపై వివరించడం జరిగింది. అప్పటి డీసీపీ గజరావు భూపాల్ కూడా కొత్త ఠాణా ఏర్పాటు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించినప్పటికీ కార్యరూపం మాత్రం దాల్చలేదు. కాస్త ఆలస్యమైనప్పటికీ అధికారులు అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకున్నారు.

అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లో చేరుతున్నారు


ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన పిల్లోనిగూడకు చెందిన బీజేపీ నేతలు


ర్యాలీగా తరలి వస్తున్న నాయకులు

బండ్లగూడ: సీఎం కేసీఆర్ రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి పనులను చూసే బీఆర్ఎస్‌లో చేరుతున్నారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ 10వ డివిజన్‌కు చెందిన ఎంఐఎం పార్టీ కార్పొరేటర్ అస్తాంబిన్ అబ్దుల్లా 100 మంది కార్యకర్తలతో శనివారం రాజేంద్రనగర్ క్యాంప్ ఆఫీస్‌లో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తరువాత అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందిందని అన్నారు. కార్యక్రమంలో మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్ రెడ్డి, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్ నాయకులు గోపాల్ ముదిరాజ్, పాపయ్య యాదవ్, మల్లేష్ యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, సయ్యద్ ఖాజా, రాజక్, సుమన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్: బీజేపీ నేతలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కె. చంద్రారెడ్డి ఆధ్వర్యంలో శనివారం పిల్లోనిగూడ గ్రామానికి చెందిన బీజేపీ నేతలు గులాబీ కండువా కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. నర్సింహ, చెన్నయ్య, అరుణ్‌కుమార్ తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు రవి, నీరటి రాజు,సత్యనారాయణ పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీల విజేత తనిష్కి యాదవ్


పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హిమాయత్‌సాగర్‌లో శనివారం జిల్లా స్థాయి రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్- 2023 టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా స్థాయిలో మల్లయుద్ధం 57 కేజీల విభాగంలో నిర్వహించిన పోటీలలో గొల్లకిటికి చెందిన తనిష్కి యాదవ్ మొదటి స్థానం సాధించారు. కార్యక్రమంలో మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్ ముద్దం రాము, నాయకులు ఆంజనేయులు, గోపాల్ ముదిరాజ్, పాపయ్యయాదవ్, నదీం తదితరులు పాల్గొన్నారు.

అభినందన

బండ్లగూడ: ఫోర్త్ ఫెడరేషన్ కఫ్ టోంగ్ ఇల్ మూడో ఛాంపియన్‌షిప్-2023 అసోసియేషన్ ఆఫ్ హర్యానా కురుక్షేత్రలో నిర్వహించిన పోటీల్లో బండ్లగూడ జాగీర్‌కు చెందిన సచిన్‌గౌడ్ గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల విద్యార్థులు ధైర్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, తలారి చంద్రశేఖర్, నాయకులు పాపయ్యయాదవ్, గోపాల్‌ముదిరాజ్, రమేష్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, నదీం మాస్టర్లు రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణలో పాల్గొన్న పలువురు రచయితలు

గన్‌ఫౌండ్రీ: ఒంటరి మహిళ జీవితం ఎంతో వివక్షతతో కూడుకొని ఉంటుందని వక్తలు అన్నారు. శనివారం రవీంద్రభారతిలో హస్మిత ప్రచురణల ఆధ్వర్యంలో బండారు. విజయ, పి.జ్యోతి రచించిన స్వయంసిద్ధ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు సి.మృణాళిని మాట్లాడుతూ.. ఒంటరి మహిళ జీవితం గురించి అక్కడక్కడ రెండు వ్యాఖ్యలు తప్పా వారి పక్షాన నిలిచిన సాహిత్యం పెద్దగా లేదన్నారు. అటువంటి సమయంలో ఒంటరి మహిళ జీవితంలోని విభిన్న కోణాలను ప్రపంచానికి తెలియజెప్పేలా పుస్తకాన్ని తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మహిళా రచయితలు డాక్టర్ చెల్లపల్లి స్వరూపరాణి, రుక్మిణిరావు, షీలా సుభద్రాదేవి, పీఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు వి.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

గోల్కొండ: అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని హకీంపేట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కిరాణా స్టోర్ లేన్‌లో జరుగుతున్న ఎస్‌పీ 3 పైప్ లైన్ పనులను పరిశీలించారు. ఈ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని, ఈ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను పూర్తి చేయాలని, రోడ్డుపై ఉన్న మట్టి కుప్పలను వెంటనే తరలించాలని ఆయన సూచించారు. అదే విధంగా మురుగునీరు రోడ్లపై రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు అబ్బాస్ తదితరులున్నారు.

మేరు కులస్తులకు సీట్లు కేటాయించండి


భారీ ర్యాలీ నిర్వహించిన పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: మేరు కులస్తులకు రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎక్కువ సీట్లు కేటాయించాలని రాష్ట్ర మేరు దర్జీ యువజన సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కర్ణాటక తరహాలో తెలంగాణలో కూడా కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు. ఈ మేరకు శనివారం పాతబస్తీ నుంచి గాంధీభవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేను కలిశారు. నగరంలోని ఎల్బీనగర్, అంబర్‌పేట్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో మేరు కులస్తులకే టికెట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రికి ఆహ్వానం

జియాగూడ: జియాగూడ రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 16న జరిగే స్వామివారి రథోత్సవానికి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆహ్వానించినట్లు ఆలయ ప్రతినిధి శేషాచార్యులు, బేగంబజార్ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, సభ్యులు బద్రీనాథ్ తెలిపారు.

ప్రజా సమస్యలపై కలిసికట్టుగా పోరాడాలి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై అందరూ కలిసికట్టుగా పోరాటం చేయాలని, పార్టీ టికెట్టు ఎవరికి ఇచ్చినా.. రాజేంద్రనగర్ అసెంబ్లీ గడ్డపై బీజేపీ జెండా ఎగరవేయాలని రంగారెడ్డి జిల్లా రూరల్ అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పున్నముని మల్లేష్ యాదవ్, కో-కన్వీనర్ మహాలింగంగౌడ్ అధ్యక్షతన శనివారం బీజేపీ పార్టీ ఆల్ ఇండియా లెవల్ బూత్ స్వశక్తి కరణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి బూత్‌లో 31 మందితో కమిటీలు వేయాలని... ప్రతి బూత్‌లో 2-3 చొప్పున వాల్ పెయింటింగ్ ఈ నెల 19వ తేదీ వరకు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్యదర్శి డాక్టర్ ప్రేమ్ రాజ్ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సిద్దిపేట ఇన్‌చార్జి టి.అంజన్ కుమార్ గౌడ్, చేవేళ్ల పార్లమెంటు కన్వీనర్ మల్లారెడ్డి, బుక్క గోపాల్, తోకల శ్రీనివాస్ రెడ్డి, సంగీత, కె.నరేందర్ రెడ్డి, ఎం.కొమురయ్య, సిహెచ్.చంద్రయ్య, నంద కిశోర్, కార్పొరేటర్లు భూపాల్‌గౌడ్, ప్రశాంత్ నాయక్, డివిజన్ అధ్యక్షులు విజయ్ కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా రూరల్ అధ్యక్షులు నర్సింహారెడ్డి

సన్మానం

గన్‌ఫౌండ్రీ: సంగీతం మనస్సుకు ఎంతో ఉల్లాసాన్ని కలిగిస్తుందని పలువురు ప్రముఖులు అన్నారు. శనివారం రవీంద్రభారతిలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ పిపుల్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రముఖ సినీ దర్శకుడు సాలూరి వాసురావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి కాకి మాధవరావు, ట్రస్ట్ అధ్యక్షుడు వాసురావు, ఉపాధ్యక్షుడు అశ్విని సుబ్బారావు పాల్గొన్నారు.